# నమస్తే ఉదయం


తెలుగు దినపత్రిక

సంపుటి: 3 | సంచిక: 20 | పేజీలు: 5 | వెల: రూ.4/- | సోమవారం 8 సెప్టెంబర్ 2025 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


## బ్లడ్ మూన్ కనువిందు

హైదరాబాద్, సెప్టెంబర్ 7 (నమస్తే ఉదయం)

దేశవ్యాప్తంగా ఆదివారం రాత్రి సంపూర్ణ చంద్ర గ్రహణం కనిపించింది. అత్యంత అరుదైన ఈ ఖగోళ అద్భుతాన్ని విద్యార్థులు, శాస్త్రవేత్తలు ఆసక్తిగా పరిశీలించారు. సూర్యుడు, చంద్రుడు మధ్య నుంచి భూమి పయనించడం వల్ల సూర్య కాంతి చంద్రునిపై పడదు. ఫలితంగా చంద్ర గ్రహణం ఏర్పడుతుంది. సూర్య కిరణాలు పరావర్తనం చెందడంతో చంద్రుడు రాగి ఎరుపు రంగులో (బ్లడ్‌మూన్) కనిపించాడు.



## పార్టీ మారిన ఎమ్మెల్యేలతో

# సీఎం రేవంత్ భేటీ

### ఎమ్మెల్యేల ఫిరాయింపుల కేసులో భాగంగా పదిమంది ఎమ్మెల్యేలకు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ నోటీసులు జారీ





హైదరాబాద్, సెప్టెంబర్ 7 (నమస్తే ఉదయం)

తెలంగాణలో సంచలనంగా మారిన ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. సీఎం రేవంత్ రెడ్డి నివాసంలో పార్టీ మారిన ఎమ్మెల్యేలు అత్యవసర భేటీ అయ్యారు. సుప్రీంకోర్టు తీర్పును గౌరవించి పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేలకు స్పీకర్ నోటీసుల జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఏం చేయాలనే అంశంపై సీఎం చర్చిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సమావేశానికి డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. ఎమ్మెల్యేల ఫిరాయింపుల కేసులో భాగంగా బీఆర్ఎస్ నుంచి పార్టీ మారిన పదిమంది ఎమ్మెల్యేలకు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ నోటీసులు జారీ చేశారు. అయితే.. ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న పలువురు ఎమ్మెల్యేలు తాము బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నామంటూ.. పలు సందర్భాల్లో ప్రకటించారు. శాసనసభ రికార్డుల్లోనూ పది మంది ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలుగానే ఉన్నారు. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే.. సుప్రీంకోర్టు నిర్దేశించిన గడువు లోపల పది మంది ఎమ్మెల్యేలపై విచారణ పూర్తి చేసి స్పీకర్ నిర్ణయం ప్రకటిస్తారా..? లేక పెండింగ్‌లో పెడతారా..? అన్నది చర్చనీయాంశంగా మారింది. కొన్ని గంటలుగా.. వాడీవేడిగా సాగిన ఈ సమావేశం ముగిసింది. ఈ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డితో ఎమ్మెల్యేలు విడివిడిగా భేటీ అయ్యినట్లు తెలుస్తోంది. అయితే.. స్పీకర్ నోటీసులకు ఇప్పటికే కొందరు ఎమ్మెల్యేలు వివరణ ఇవ్వగా.. మిగతా వారూ వివరణ ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. మరోవైపు ఆయా నియోజకవర్గాల అభివృద్ధి పనులకు ప్రత్యేక నిధులు కేటాయించాలని ఎమ్మెల్యేలు విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలో గొడవలు, నేతల మధ్య విభేదాలను సీఎం దృష్టికి తీసుకొచ్చారు. నియోజకవర్గ నేతల మధ్య విభేదాల పరిష్కారం బాధ్యతను పీసీసీ ఛీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌కు అప్పగిస్తానని ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది.



### భారత్, అమెరికా ఫ్రెండ్స్

## కానీ దేశానికి మాత్రం

# మోదీ శత్రువే: ఖర్గే

### మోదీపై ఖర్గే కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్, సెప్టెంబర్ 7 (నమస్తే ఉదయం)

భారత ప్రధాని నరేంద్ర మోదీ మన దేశానికి శత్రువంటూ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. అమెరికా సుంకాల అంశాన్ని ప్రస్తావిస్తూ, ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్- మోదీ మళ్లీ స్నేహితులను కావొచ్చని వ్యాఖ్యానించారు. మోదీ, ట్రంప్ పరస్పరం ఓట్లు కోరినందున ఒకరికొకరు మంచిగా ఉండవచ్చని అన్నారు. ఈ మేరకు కర్ణాటకలోని కలబురిగిలో పలు వ్యాఖ్యలు చేశారు.

మోదీ- ట్రంప్ పొత్తు భారతదేశం ఖర్చుతో వచ్చిందని ఖర్గే పేర్కొన్నారు. "మీరు(మోదీ) మీ సిద్ధాంతాల ప్రకారం నడుచుకోండి. కానీ దేశ ప్రజలను రక్షించండి. ఎందుకంటే దేశం ముందు. మీ స్నేహం ద్వితీయం" అని ఆయన నొక్కి చెప్పారు. భారతదేశం దశాబ్దాలుగా తటస్థత, అలీన విదేశాంగ విధానాన్ని అనుసరిస్తోందని, అది ఆ మార్గంలోనే కొనసాగాలని ప్రధానమంత్రిని ఖర్గే కోరారు.

#### 8 ఏళ్లుగా హింసిస్తోంది!

సవరించిన జీఎస్టీ రేట్లపై, పేదలకు ప్రయోజనం చేకూర్చే ఏ చర్యనైనా కాంగ్రెస్ స్వాగతిస్తుందని ఖర్గే అన్నారు. కానీ

**మొదటి పేజీ తరువాయి...**

బీజేపీ ప్రభుత్వం సంవత్సరాలుగా ప్రజలను హింసిస్తోందని ఆరోపించారు. "మేం ఆ అంశాన్ని ఎనిమిదేళ్ల క్రితం లేవనెత్తాం. రెండు శ్లాబులు ఉంటే అది పేద ప్రజలకు ప్రయోజనం చేకూరుస్తుందని మేం చెప్పాం. కానీ వారు నాలుగు నుంచి ఐదు శ్లాబులను ప్రవేశపెట్టి ప్రజలను దోచుకున్నారు. ఎన్నికలు సమీపించిన తర్వాత కొన్ని ఇబ్బందులను ఎదుర్కొని జీఎస్టీ శ్లాబులను సవరించారు" అని ఆయన పేర్కొన్నారు.

#### ఇప్పుడు మోదీ ప్రవేశించారు!

చైనా చొరబాటు సమయంలో ఎవరూ భారత భూభాగంలోకి ప్రవేశించలేదని మోదీ గతంలో ..మిగతా 2లో



### జస్టిస్ సుదర్శన్ రెడ్డికి

# ఎంఐఎం మద్దతు

### ఒవైసీకి థాంక్స్ చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి

### ఉపరాష్ట్రపతి అభ్యర్థి ఇంకా ఏ నిర్ణయం తీసుకోని బీఆర్ఎస్ పార్టీ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 7 (నమస్తే ఉదయం)

ఉపరాష్ట్రపతి ఎన్నికల వేళ తెలంగాణ రాజకీ యాల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ఇండియా కూటమి అభ్యర్థిగా బరిలో ఉన్న జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డికి మద్దతు ఇస్తున్నట్లు ఏఐ ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదు ద్దీన్ ఒవైసీ ఆదివారం ప్రకటించారు. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఫోన్ చేసి చేసిన విజ్ఞప్తి మేరకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ పరిణామంపై సీఎం రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా ఒవైసీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. "జాతీయ ప్రయోజనాల దృష్ట్యా జస్టిస్ సుదర్శన్ రెడ్డి గారికి మద్దతుగా ముందుకు వచ్చినందుకు అసదుద్దీన్ ఒవైసీ భాయ్‌కి ధన్యవాదాలు" అని రేవంత్ రెడ్డి తన పోస్టులో పేర్కొన్నారు. అంతకుముందు, ముఖ్యమంత్రి తనతో ఫోన్‌లో మాట్లాడి జస్టిస్ సుదర్శన్ రెడ్డికి మద్దతివ్వాలని కోరినట్లు ఒవైసీ వెల్లడించారు. హైదరాబాదీ అయిన సుదర్శన్ రెడ్డికి ఎంఐఎం పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని తెలిపారు. తాను జస్టిస్ రెడ్డితో కూడా మాట్లాడి శుభాకాంక్షలు తెలియజేసినట్లు ఒవైసీ పేర్కొన్నారు. వాస్తవానికి, ఎంఐఎం పార్టీ ఇండియా ..మిగతా 2లో

# నరక కూపాలుగా గురుకులాలు



### రేవంత్ సర్కార్‌పై హరీశ్ రావు ఫైర్

### కేసీఆర్ హయాంలో గురుకులాలు దేశానికే ఆదర్శమని వ్యాఖ్య

### సిబ్బంది జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్

హైదరాబాద్, సెప్టెంబర్ 7 (నమస్తే ఉదయం)

రాష్ట్రంలోని గురుకుల విద్యాసంస్థల పరిస్థితిపై బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గురుకులాలు నరక కూపాలుగా మారాయని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. విద్యార్థులు ఫుడ్ పాయిజనింగ్, పాముకాట్లు, విష జ్వరాల బారిన పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ సందర్భంగా హరీశ్ రావు స్పందిస్తూ.. "ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా గురుకులాలను పర్యవేక్షిస్తానని చెప్పిన మాటలు నీటి మూటలయ్యాయి. కల్తీ ఆహారం పెడితే జైలుకేనని చేసిన హెచ్చరికలు గాలి మాటలయ్యాయి" అని ఎద్దేవా చేశారు. గురుకులాల్లో పనిచేస్తున్న దాదాపు 2500 మంది కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ సిబ్బందికి గత రెండు నెలలుగా జీతాలు చెల్లించకపోవడం దారుణమని అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం నాడు ఆడంబరపు ప్రకటనలు ఇచ్చే బదులు, వారికి సకాలంలో జీతాలు చెల్లించడంపై ప్రభు త్వం దృష్టి పెట్టాలని సూచించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంతో ప్రస్తుత పరిస్థితిని పోలుస్తూ, ..మిగతా 2లో

# స్థానిక సమరమే లక్ష్యం

### 15న కామారెడ్డిలో కాంగ్రెస్ భారీ బహిరంగ సభ

### బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై విజయోత్సవ వేడుక

### హాజరుకానున్న రాహుల్ గాంధీ, ఖర్గే, సీఎం సిద్ధరామయ్య

### స్థానిక ఎన్నికలే లక్ష్యంగా బీసీ వర్గాలను ఆకట్టుకునే వ్యూహం

### లక్ష మందికి పైగా జనసమీకరణకు పార్టీ ప్రణాళిక

### గతంలో బీసీ డిక్లరేషన్ ప్రకటించిన చోటే సభ నిర్వహణ




2లో..

# స్థానిక సమరమే లక్ష్యం

**హైదరాబాద్, సెప్టెంబర్ 7 (నమస్తే ఉదయం)**




త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని, బీసీ ఓటు బ్యాంకును తమ వైపు తిప్పుకోవడానికి అధికార కాంగ్రెస్ పార్టీ భారీ ప్రణాళిక రచించింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే దిశగా ప్రభుత్వం తీసుకున్న చర్యలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు ఈ నెల 15న కామారెడ్డిలో 'బీసీ డిక్లరేషన్ విజయో త్సవ సభ'ను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని నిర్ణయించింది. ఈ సభ ద్వారానే స్థానిక ఎన్నికల ప్రచారానికి శంఖారావం పూరించాలని భావిస్తోంది. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యలను ముఖ్య అతిథులుగా ఆహ్వానించనున్నారు. లక్ష మందికి పైగా జనసమీకరణ చేసి, ఈ సభను విజయవంతం చేయాలని రాష్ట్ర నాయకత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

సభా నిర్వహణ ఏర్పాట్లపై చర్చించేందుకు శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ నివాసంలో ముఖ్య నేతలు సమావేశమయ్యారు. ఈ భేటీలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క పాల్గొని జన సమీకరణ, సభా ఏర్పాట్లపై చర్చించారు. దీనికి కొనసాగింపుగా ఆదివారం కామారెడ్డి పట్టణంలో మరో ముఖ్యమైన సన్నాహక సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాతో పాటు సమీపంలోని కరీంనగర్, మెదక్, సిద్దిపేట జిల్లాల మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, డీసీసీ అధ్యక్షులు పాల్గొంటారు. అనంతరం పీసీసీ అధ్యక్షుడు, మంత్రులు సభ నిర్వహణకు అనువైన స్థలాన్ని పరిశీలించనున్నారు.

### కామారెడ్డి వేదికనే ఎందుకు ఎంచుకున్నారంటే?

గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై కామారెడ్డి నుంచి రేవంత్ రెడ్డి పోటీ చేశారు. ఆ సమయంలో కామారెడ్డిలో జరిగిన కాంగ్రెస్ సభలోనే కర్ణాటక సీఎం సిద్ధరామయ్య 'బీసీ డిక్లరేషన్' ప్రకటించారు. అధికారంలోకి వస్తే కులగణన చేపట్టి, బీసీలకు రిజర్వేషన్లు పెంచుతామని హామీ ఇచ్చారు. ఆ హామీకి అనుగుణంగానే, రాష్ట్రంలో కులగణన చేపట్టి బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ ప్రభుత్వం ఆర్డినెన్స్‌ను గవర్నర్ ఆమోదానికి పంపింది. ఏ వేదికపై అయితే హామీ ఇచ్చారో, అదే వేదికపై నుంచి విజయోత్సవ సభ జరపడం ద్వారా బీసీ వర్గాలకు బలమైన సందేశం పంపవచ్చని కాంగ్రెస్ భావిస్తోంది.

# సాధారణ ఎంపీలా మోదీ

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 7 (నమస్తే ఉదయం)**



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన నిరాడంబరతను మరోసారి చాటుకున్నారు. పార్లమెంట్ ప్రాంగణంలోని జీఎంసీ బాలయోగి ఆడిటోరియంలో జరిగిన బీజేపీ వర్క్‌షాప్‌లో ఆయన తోటి పార్లమెంట్ సభ్యులతో పాటు చివరి వరుసలో కూర్చొని అందరినీ ఆశ్చర్యపరిచారు. దేశంలో వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) విధానంలో ప్రభుత్వం చేపట్టిన కీలక సంస్కరణలపై జరిగిన ఈ సమావేశంలో ఆయన ఒక సాధారణ ఎంపీలా పాల్గొన్నారు.

ఈ వర్క్‌షాప్‌లో జీఎస్టీ సంస్కరణలకు మద్దతుగా బీజేపీ ఎంపీలందరూ ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించారు. సెప్టెంబర్ 3న జీఎస్టీ కౌన్సిల్ తీసుకున్న నిర్ణయాలతో దేశ పరోక్ష పన్నుల విధానంలో సరికొత్త శకం మొదలైంది. ఈ మార్పుల ప్రకారం, దేశవ్యాప్తంగా ఇకపై 5 శాతం, 18 శాతం అనే రెండు ప్రధాన పన్ను శ్లాబులు మాత్రమే ఉంటాయి. అయితే, సిన్ గూడ్స్ (హానికర ఉత్పత్తులు) పై 40 శాతం అధిక పన్ను వర్తిస్తుంది.

ఈ సంస్కరణల ఫలితంగా పలు నిత్యావసర వస్తువుల ధరలు గణనీయంగా తగ్గనున్నాయి. కిరాణా సరుకులు, బట్టలు, పాదరక్షలు, ఎరువులు, పునరుత్పాదక ఇంధన ఉత్పత్తులు వంటివి చౌకగా లభించనున్నాయి. గతంలో 12 శాతం, 28 శాతం పన్ను శ్లాబుల్లో ఉన్న అనేక వస్తువులను ఈ రెండు కొత్త శ్లాబుల్లోకి మార్చడంతో సామాన్య, మధ్యతరగతి కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గుతుందని అధికారులు తెలిపారు.

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట నుంచి ప్రసంగిస్తూ, మధ్యతరగతి ప్రజలకు జీఎస్టీ కింద ఉపశమనం కల్పిస్తామని ప్రధాని మోదీ హామీ ఇచ్చారు. ఆ హామీకి అనుగుణంగానే ఈ సంస్కరణలు చేపట్టినట్టు తెలుస్తోంది. ఈ మార్పుల వల్ల ప్రజల చేతిలో డబ్బు మిగిలి, కొనుగోలు శక్తి పెరుగుతుందని, తద్వారా వినియోగం పెరిగి దేశ ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపు వస్తుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది.

# జస్టిస్ సుదర్శన్ రెడ్డికి ఎంఐఎం మద్దతు



**మొదటి పేజీ తరువాయి...**

కూటమిలో భాగస్వామి కానప్పటికీ ఈ మద్దతు ప్రకటించడం గమనార్హం. మరోవైపు, "తెలుగు ఆత్మగౌరవం" నినాదంతో జస్టిస్ సుదర్శన్ రెడ్డికి మద్దతివ్వాలని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని రాజకీయ పార్టీలను సీఎం రేవంత్ రెడ్డి కోరారు. అయితే, తెలంగాణలోని ప్రతిపక్ష పార్టీ బీఆర్ఎస్ ఇంకా ఏ అభ్యర్థికి మద్దతిచ్చేది ప్రకటించలేదు. రాష్ట్రానికి యూరియా కొరతను తీరుస్తామని హామీ ఇచ్చిన వారికే తమ మద్దతు ఉంటుందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గతంలో వ్యాఖ్యానించారు. రాజ్యసభలో బీఆర్ఎస్‌కు నలుగురు సభ్యులు ఉన్నారు.

ఇక ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితి భిన్నంగా ఉంది. అధికార టీడీపీ, జనసేన పార్టీలు ఎన్డీయేలో భాగస్వాములు కావడంతో తమ కూటమి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌కు మద్దతు ప్రకటించాయి. అదేవిధంగా, ఏ కూటమిలోనూ లేని వైసీపీ కూడా ఎన్డీయే అభ్యర్థికే మద్దతు ఇస్తున్నట్లు తెలిపింది. మద్యం కుంభకోణం కేసులో అరెస్టయిన ఆ పార్టీ ఎంపీ మిథున్ రెడ్డి, ఈ ఎన్నికల్లో ఓటు వేసేందుకు మధ్యంతర బెయిల్ మీద శనివారం జైలు నుంచి విడుదలయ్యారు.

సెప్టెంబర్ 9న ఉపరాష్ట్రపతి ఎన్నిక జరగనుండగా, తెలుగు రాష్ట్రాల్లోని పార్టీలు భిన్న వైఖరులతో ముందుకు సాగుతున్నాయి.

# చంద్రగ్రహణం ఎఫెక్ట్

**హైదరాబాద్, సెప్టెంబర్ 7 (నమస్తే ఉదయం)**

చంద్రగ్రహణం కారణంగా తిరుమల శ్రీవారి ఆలయ ద్వారాలు మూతపడ్డాయి. ఆదివారం నాడు ఏకాంత సేవ ముగిసిన వెంటనే, ఆగమశాస్త్ర సంప్రదాయం ప్రకారం ఆలయానికి తాళాలు వేశారు. సన్నిధి గొల్ల బంగారు వాకిలికి తాళం వేయడంతో ఆలయ మూసివేత ప్రక్రియ పూర్తయింది. ఈ ప్రభావంతో సుమారు 12 గంటలకు పైగా శ్రీవారి దర్శనాలు పూర్తిగా నిలిచిపోనున్నాయి.

తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) వెల్లడించిన వివరాల ప్రకారం, సోమవారం తెల్లవారుజామున 3 గంటలకు ఆలయాన్ని తిరిగి తెరుస్తారు. అనంతరం ఆలయంలో శుద్ధి, పుణ్యాహవచనం వంటి సంప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఆ తర్వాత శ్రీవారికి నిర్వహించే నిత్య సేవలను ఏకాంతంగా పూర్తి చేసి, భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. సర్వదర్శనం కోసం వచ్చే భక్తులను సోమవారం వేకువజామున 2 గంటల నుంచి క్యూలైన్లలోకి అనుమతించనున్నట్లు టీటీడీ అధికారులు తెలిపారు.

శ్రీవారి ఆలయంతో పాటు తిరుమలలోని ఇతర ఉప ఆలయాలను కూడా మూసివేశారు. అంతేకాకుండా, భక్తులకు నిరంతరం సేవలు అందించే లడ్డూ ప్రసాదాల కౌంటర్లు, అన్నప్రసాద కేంద్రాలను కూడా గ్రహణం ముగిసే వరకు మూసివేస్తున్నట్లు ప్రకటించారు. గ్రహణం కారణంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టీటీడీ ముందుజాగ్రత్త చర్యలు చేపట్టింది. సుమారు 50 వేల పులిహోర ప్యాకెట్లు, బిస్కెట్ ప్యాకెట్లను సిద్ధంగా ఉంచింది. కాగా, ఆదివారం శ్రీవారిని 27,525 మంది భక్తులు దర్శించుకున్నట్లు టీటీడీ అధికారులు వెల్లడించారు.



## ధైర్యంగా అమెరికాపై 75 సుంకాలు వేయండి

### మోదీకి కేజ్రీవాల్ సవాల్

### 50 శాతం సుంకాలకు ప్రతిస్పందన చర్యలు చేపట్టమని కోరిన ఆప్ కన్వీనర్

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 7 (నమస్తే ఉదయం)**



అమెరికా దిగుమతులపై ధైర్యంగా 75 శాతం సుంకం విధించాలని ప్రధాని మంత్రి నరేంద్ర మోదీని ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ సవాల్ విసిరారు. ట్రంప్ విధించిన 50 శాతం సుంకాలకు ప్రతిస్పందననగా చర్యలు తీసుకోవాలని కోరారు. డిసెంబర్ 31వ తేదీ వరకు అమెరికా నుంచి పత్తి దిగుమతులపై 11 శాతం సుంకాన్ని మినహాయించాలన్న కేంద్రం నిర్ణయం భారత పత్తి రైతులను దెబ్బతీస్తుందని పేర్కొన్నారు. ఇది అమెరికా రైతులను ధనవంతులుగా, గుజరాత్ సాగుదారులను పేదలుగా మారుస్తుందని ఆయన అన్నారు.

"ప్రధాని ధైర్యం చూపించాలని మేం కోరుతున్నాం. దేశం మొత్తం మీ వెనుక ఉంది. భారతదేశం నుంచి వచ్చే ఎగుమతులపై అమెరికా 50 శాతం సుంకం విధించింది. మీరు అమెరికా నుంచి వచ్చే దిగుమతులపై 75 శాతం సుంకం విధించండి. దేశం దానిని భరించడానికి సిద్ధంగా ఉంది. దానిని విధించండి. అప్పుడు ట్రంప్ తలొగ్గుతుందో లేదో చూడండి" అని కేజ్రీవాల్ అన్నారు.

మోకాళ్లపై మోదీ ప్రభుత్వం పడింది!

అమెరికా నుంచి దిగుమతి చేసుకునే పత్తిపై 11 శాతం సుంకం విధించాలని, కనీస మద్దతు ధరను నిర్ణయించాలని కేజ్రీవాల్ డిమాండ్ చేశారు. 20 కిలోలకు రూ. 2,100 చొప్పున పత్తిని సేకరించాలని, అలాగే ఎరువులు, విత్తనాలపై సబ్సిడీని కూడా ఆయన డిమాండ్ చేశారు. భారత్‌పై అమెరికా విధించిన 50 శాతం సుంకం వస్త్రాల కార్మికులను కూడా ప్రభావితం చేసిందని, ఎందుకంటే మోదీ ప్రభుత్వం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ముందు మోకాళ్లపై పడిందని ఆరోపించారు.

ప్రధాని ఎందుకు వంగి బలహీనంగా మారారు?

డిసెంబర్ 31 వరకు పత్తిపై దిగుమతి సుంకం మినహాయింపును పొడిగించాలనే నిర్ణయం ఎగుమతి మార్కెట్లలో భారత్ స్థానాన్ని బలోపేతం చేస్తుందని కేజ్రీవాల్ తెలిపారు. ట్రంప్ భారత్‌పై 50 శాతం సుంకం విధించినప్పుడు, మోదీ దానికి ప్రతిగా పెంచలేదని తెలిపారు. కానీ దానిని (అమెరికా నుంచి పత్తి దిగుమతులపై) 11 శాతం తగ్గించారని, ప్రధాని ఎందుకు వంగి బలహీనంగా మారారని ప్రశ్నించారు.

భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద మార్కెట్ అని, ఇక్కడి ప్రజలు మోదీ వెనుక నిలబడతారని అన్నారు. "దేశం మొత్తం మోదీజీ వెనుక నిలబడి ఉంది. ఆయన (ట్రంప్) 50 శాతం సుంకం విధించారు. మోదీజీ పత్తిపై 100 శాతం సుంకం విధించి ఉండాలి. ట్రంప్ తలవంచాల్సి వచ్చేది. ట్రంప్ ఒక పిరికివాడు. తనను ధిక్కరిస్తే అన్ని దేశాల ముందు ఆయన తలవంచుతారు. నాలుగు అమెరికన్ కంపెనీలను మూసివేయండి, వారు ఇబ్బందుల్లో పడతారు" అని ఆయన పేర్కొన్నారు.

అమెరికా నుండి దిగుమతి చేసుకునే పత్తిపై 11 శాతం సుంకాన్ని తొలగించాలనే భారత్ విధాన నిర్ణయం కారణంగా, అక్టోబర్-నవంబర్‌లో రైతులు మార్కెట్‌కు తీసుకువచ్చినప్పుడు వారి ఉత్పత్తులను విక్రయించబోమని కేజ్రీవాల్ అన్నారు. "అమెరికా నుంచి పత్తి (భారతదేశంలోకి) వచ్చినప్పుడు, ఇక్కడి రైతులకు మార్కెట్లో రూ. 900 కంటే తక్కువ లభిస్తుంది. రైతుల విషయంలో ఇదే జరుగుతోంది. అమెరికా రైతులు ధనవంతులుగా మారుతున్నారు. గుజరాత్ రైతులు పేదలుగా మారుతున్నారు" అని తెలిపారు.

"ఇప్పుడు మన దేశంలోని రైతులు తమ పత్తిని అమ్మడానికి మార్గం లేదు. మన దేశంలోని రైతు రుణం తీసుకొని విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేశాడు, (వ్యవసాయ) కార్మికులకు డబ్బు చెల్లించారు. ఇప్పుడు ఆయన రుణాన్ని ఎలా తిరిగి చెల్లిస్తాడు? బలవన్మరణకు పాల్పడడం తప్ప వేరే మార్గం ఉండదు" అని ఆప్ కన్వీనర్ పేర్కొన్నారు. అమెరికా ముందు భారత్ నిస్సహాయతను కూడా ఆయన ప్రశ్నించారు. ట్రంప్ సుంకాలు విధించిన ఇతర దేశాలు తీవ్రంగా స్పందించాయని కేజ్రీవాల్ తెలిపారు. కానీ భారత్ ఎటువంటి చర్య తీసుకోలేదని పేర్కొన్నారు.

## భారత్, అమెరికా ఫ్రెండ్స్.. కానీ దేశానికి మాత్రం మోదీ శత్రువే: ఖర్గే

**మొదటి పేజీ తరువాయి...**

చేసిన వాదనను కూడా ఖర్గే ప్రస్తావించారు. ఇప్పుడు మోదీ స్వయంగా చైనాలోకి ప్రవేశించారని ఎద్దేవా చేశారు. జాతీయ ప్రయోజన సమస్యలపై ప్రతిపక్షాలు ఐక్యంగా ఉన్నప్పటికీ, మోదీ మద్దతును దుర్వినియోగం చేయడానికి అది అనుమతించదని తేల్చిచెప్పారు కాంగ్రెస్ అధ్యక్షుడు.

"దేశం విషయానికి వస్తే మేం ఒక్కటే. అందులో ఎటువంటి సందేహం లేదు. కానీ మేం మీకు మద్దతు ఇస్తున్నందున, మీరు ఏదైనా ఏకపక్షంగా చేయాలని దాని అర్థం కాదు. మేం దీన్ని నమ్మం" అని ఆయన అన్నారు. ట్రంప్‌తో బహిరంగంగా పొత్తు పెట్టుకోవడం ద్వారా భారత్ అంతర్జాతీయ ఖ్యాతిని మోజీ దెబ్బతీశారని ఖర్గే ఆరోపించారు. "'ట్రంప్ నా స్నేహితుడు', 'ఫిర్ ఏక్ బార్ ట్రంప్' (ట్రంప్, మరోసారి) అని చెప్పడం ద్వారా ఆయన భారత్ స్థానాన్ని పాడు చేశారు" అని ఆరోపించారు.

బిహార్‌లో రాబోయే ఎన్నికలలో కాంగ్రెస్ హైలైట్ చేయాలని యోచిస్తున్న అంశాలను ఖర్గే వెల్లడించారు. "మాకు చాలా సమస్యలు ఉన్నాయి. నిరుద్యోగం, శాంతిభద్రతలు, మహిళలపై లైంగిక దాడులు, దళితులు- వెనుకబడిన తరగతులకు స్కాలర్‌షిప్‌లు అందడం లేదు. రైతులకు ఎరువులు అందడం లేదు. 'ఓట్ల చోరీ' అంశం కూడా మా ప్రధాన ఎజెండా" అని కాంగ్రెస్ అధ్యక్షుడు తెలిపారు. కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం బ్యాలెట్ పేపర్లను ఉపయోగించి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించడం మంచిదేనని తెలిపారు. "మేం దీనిని డిమాండ్ చేస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో దీనిని ప్రవేశపెట్టింది. నేను దానిని స్వాగతిస్తున్నాను" అని ఆయన తెలిపారు.

## నరక కూపాలుగా గురుకులాలు

**మొదటి పేజీ తరువాయి...**

కేసీఆర్ హయాంలో గురుకులాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని హరీశ్ రావు గుర్తుచేశారు. "నాడు కేసీఆర్ గురుకులాల సంఖ్యను 294 నుంచి 1024కి, విద్యార్థుల సంఖ్యను లక్షా 90 వేల నుంచి ఆరున్నర లక్షలకు పెంచి నాణ్యమైన విద్యను అందించారు. విద్యపై పెట్టే ఖర్చును ఆయన పెట్టుబడిగా భావించారు. కానీ, కాంగ్రెస్ 22 నెలల పాలనలో గురుకులాల ఖ్యాతి అధఃపాతాళానికి పడిపోయింది" అని ఆరోపించారు. ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి గాడితప్పిన గురుకుల వ్యవస్థను చక్కదిద్దాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను తక్షణమే పరిష్కరించడంతో పాటు, పెండింగ్‌లో ఉన్న సిబ్బంది జీతాలను వెంటనే విడుదల చేయాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

# జనగామ ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం

**ఆర్యవైశ్య మహాసభ జనగామ జిల్లా ఆధ్వర్యంలో (ప్రతిభకు పట్టం) గురుపూజోత్సవం**



జనగామ, సెప్టెంబర్ 07 (నమస్తే ఉదయం):ఆర్యవైశ్య మహాసభ జనగామ జిల్లా ఆధ్వర్యంలో జిల్లా కేంద్రం లోని గాయత్రి గార్డెన్లో ఆదివారం ఆట్టాహాసముగా గురుపూజోత్సవం జరిగింది. దీనికి సభాధ్యక్షులుగా ఆర్యవైశ్య మహాసభ జనగామ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గంగిశెట్టి ప్రమోద్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పెద్ది వెంకటేశం డిప్యూటీ కమిషనర్ వాణిజ్య పన్నులు హాజరైనారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆర్యవైశ్య మహాసభ జనగామ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గంగిశెట్టి ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా ఎవరు చేయలేని విధముగా 60 మంది ఉపాధ్యాయిని ఉపాధ్యాయురాలను ఎంపిక చేసి 12 మండలాల్లో ఉన్న ఉత్తమ ఉపాధ్యాయులకు గుర్తించి వారికి గురుపూజోత్సవం సందర్భంగా అట్టహాసముగా సన్మానం చేసారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ముఖ్య అతిథి పెద్ది వెంకటేశం మాట్లాడుతూ జనగామ జిల్లాలో 12 మండలాలకు గాను 11 మండలాలు విజయవంతంగా ఎలక్షన్లు చేసి 1200 మంది సభ్యత్వంలో ఉన్న జిల్లాను 2700 సభ్యత్వాలు చేపించిన ఘనత ప్రమోద్ కుమార్ దేనని వీరికి సహకరించిన టీమ్ మెంబర్లు అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ముందు ముందు జిఎస్టి లో ఏవైనా లోటుపాట్లు ఉన్నట్లయితే తనను సంప్రదించండి అని తెలిపారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథులుగా చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు పోకల లింగయ్య, ఫర్టిలైజర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పజ్జూరి గోపయ్య, రైస్ మిల్లర్ అధ్యక్షుడు పజ్జూరి జయహరి వరంగల్ నుండి గట్టు రత్న ప్రసాద్, జిల్లా కోశాధికారి బెజగం బిక్షపతి, మహిళా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ మాద%శీ%శెట్టి వరూధిని, ప్రధాన కార్యదర్శి గంగిశెట్టి అనూజ, కోశాధికారి తమ్మి స్రవంతి, యూత్ జిల్లా అధ్యక్షులు గజ్జి సంతోష్ కుమార్, వాసవి సేవాదలు అధ్యక్షుడు నాగమల్ల సోమయ్య, రీజియన్ చైర్మన్ పడకంటి రవీందర్, జోన్ చైర్మన్లు కురేళ్ళ వేదకుమారు, గందె సోమన్న, మాశెట్టి వేణుగోపాలు, 12 మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు కోశాధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ఉత్తమ అవార్డు అందుకున్న ఉపాధ్యాయులను సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

కొత్తకోట, సెప్టెంబర్ 7 ( నమస్తే ఉదయం) కొత్తకోట మండలం లో ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు అందుకున్న ఉపాధ్యాయులను కాంగ్రెస్ పార్టీ నాయకులు సన్మానించారు. ఆదివారం ఎమ్మెల్యే జీఎంఆర్ ఆదేశాల మేరకు ఉత్తమ ఉపాధ్యాయులను కాంగ్రెస్ పార్టీ నాయకులను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఉపాధ్యాయులు దేవన్న, శేఖర్ గౌడ్, సురేష్, వెంకటనారాయణ, పి శ్రీనివాస్ గౌడ్, విష్ణువర్ధన్, వి. నాగమణి, పర్వీన్ బేగం, హుస్సేన్, ఆర్. స్వరూప లను కొత్తకోట మండల కేంద్రంలో శ్రీ.రాఘవేంద్ర స్వామి కళ్యాణ మండపంలో మదనాపూర్ మార్కెట్ చైర్మన్ పల్లెపాగ ప్రశాంత్ , కొత్తకోట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగారపు బీచుపల్లి యాదవ్ , కొత్తకోట కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పి. అరుణ శ్రీనివాస్ , జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శులు, పాపయ్య గారి కృష్ణారెడ్డి , నారమాన్ బోయేజ్ , చెర్లపల్లి మాజీ సర్పంచ్ సూది రెడ్డి శేఖర్ రెడ్డి , మాజీ కో ఆప్షన్ సభ్యులు జెయం మిషేక్ , కురుమూర్తి దేవస్థానం డైరెక్టర్ బాదం వేంకటేష్ , మైనార్టీ నాయకులు లతీఫ్ , ముజీభ్, సుభాష్, సంధ వెంకటేష్,నరేంధర్ సాగర్, పేంటన్న యాదవ్, సాయిలు యాదవ్, మాందాపూర్ లక్ష్మయ్య ,రాచాల వెంకటేష్ లను సన్మానించిన వారిలో ఉన్నారు.అనంతరం మర్యాదపూర్వకంగా మదనాపురం మార్కెట్ చైర్మన్ పల్లెపాగ ప్రశాంత్ , కొత్తకోట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పి అరుణ శ్రీనివాస్ లను సన్మానించారు.



ఫోటో ఎక్స్పో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి

# ఫోటో ఎక్స్పో పోస్టర్లను ఆవిష్కరించిన ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి

గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 7(నమస్తే ఉదయం) గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఫోటో ఎక్స్పో పోస్టర్లను ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి చేత ఆవిష్కరింప చేశారు. ఈనెల 19 ,20, 21 తేదీలలో హైదరాబాదు నార్సింగి లోని ఓం కన్వెన్షన్ లో జరిగే ఫోటో ఎక్స్పో పోస్టర్లను ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ ... ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్స్ నా వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ జి వేణుగోపాల్, మాజీ ఎంపీపీ విజయ్, , ఫోటోగ్రాఫర్స్ జిల్లా అధ్యక్షుడు ఎస్.ఎస్ శేఖర్, జిల్లా కోశాధికారి వేణు, జిల్లా ఉపాధ్యక్షుడు కొంకతి వెంకటేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు పి వెంకట్, రాములు, మస్తాన్ ,శీను, రమేష్, ప్రవీణ్, శివ ,అజిత్ ,రాజు ,ప్రశాంత్, లడ్డు ,ఫోటోగ్రాఫర్లు పాల్గొన్నారు.ం

# ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్ఫార్మర్



కేటిదొడ్డి, సెప్టెంబర్ 7 (నమస్తే ఉదయం) కేటిదొడ్డి మండలంలోని ఇర్కిచేడు గ్రామంలో ప్రధాన రహదారి పక్కన ఉన్న సింగిల్ ఫేస్ విద్యుత్తు ట్రాన్స్ఫార్మర్(25కేవీ ) ప్రమాదకరంగా మారింది. గ్రామం నుంచి ఇర్కిచేడు తండాకు వెళ్లే దారిలో ఇర్కిచేడు గ్రామంలో కాలనీ అవసరాల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్తు ట్రాన్స్ఫార్మర్ తక్కువ ఎత్తులో ఉండడంతో పశువులకు, వాహనదారులకు ప్రమాదం పొంచి ఉందని గ్రామస్తులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారులు రోడ్డు పక్కన ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేయడంతో కరెంటు తీగలు తేలియాడుతున్నాయి. ట్రాన్స్ ఫార్మర్ చుట్టూ రక్షణ కవచం లేకపోవడంతో చిన్న పిల్లలు పొరపాటున తాకే విధంగా మారింది. అంతేకాకుండా ఇర్కిచేడు మీదుగా కర్ణాటకకు, వెంకటాపురం వైపు వెళ్లేందుకు ప్రయాణికులు ఇదే రహదారిలో నిత్యం వందలాదిగా ప్రయాణిస్తుంటారు. ఆకస్మికంగా వాహనాలు అదుపుతప్పితే ట్రాన్స్ఫార్మర్ను ఢీకొనే అవకాశం ఉంది. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి ఎలాంటి ప్రాణనష్టం జరగకముందే ట్రాన్స్ఫార్మర్ ను అక్కడ నుంచి తరలించి ఎవరికి అందని ఎత్తులో ఏర్పాటు చేసి బలమైన కంచె ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.




# వైద్య శిబిరాలు పేదలకు ఎంతో దోహదం

**డాక్టర్ డి.లావణ్య మహంకాళి**

**విజయవంతమైన ఉచిత వైద్య సేవ**

గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 7(నమస్తే ఉదయం) జిల్లా కేంద్రంలో వేద నగర్ దయానంద విద్యా సమితి పాఠశాల నందు శుభకర హాస్పిటల్ సౌజన్యంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కంటి వైద్య డాక్టర్ డి.లావణ్య మహంకాళి రోగులకు కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కంటి శుక్లాల కొరకు ఆపరేషన్ కు అవసరమైన వారికి కంటి ఆపరేషన్ కూడా నిర్వహిస్తామని తెలిపారు. కంటి సమస్యలపై వచ్చిన వారిని పరీక్షించి కంటికి సంబంధించిన మందులను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. వేదనగర్ నందు నిరుపేద చేనేత కార్మికులు, కంటి చూపుతో బాధపడుతున్న పేద కుటుంబాలకు సేవలు చేయాలని సంకల్పంతో వైద్య శిబిరాలలో వైద్యం చేయడానికి నిశ్చయించుకున్నానని డాక్టర్ డి.లావణ్య మహంకాళి తెలిపారు. దయానంద విద్యా మందిరంలో ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న వైద్య శిబిరాలు నేటితో 40 ఆదివారాలు వైద్య శిబిరాలు పూర్తి చేశామని , ప్రతి ఆదివారం ఒక్కొక్క వ్యాధికి సంబంధించిన నిపుణుల డాక్టర్లను పిలిపించి ఉచిత వైద్యం నిర్వహిస్తున్నామని, ఇలాగే ప్రతి ఆదివారం నిపుణులైన డాక్టర్లచే ఉచిత వైద్య సేవ నిర్వహిస్తామని , పాఠశాల ప్రిన్సిపల్ హరినాథ్ రెడ్డి తెలిపారు. కంటికి సంబంధించిన నిపుణురాలు డాక్టర్ డి.లావణ్య మహంకాళి చే ఆధ్వర్యంలో 125 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశామని పాఠశాల హెడ్ మాస్టర్ సత్యకుమార్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ సత్యకుమార్, కళ్యాణ్, దోత్రే మనోజ్, తదితర పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



ప్రమాదవశాత్తు మృతి చెందిన గొర్రెలను పరిశీలిస్తున్న మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రశాంత్

# నష్టపోయిన గొర్రెల కాపర్లను ప్రభుత్వం ఆదుకుంటుంది

**మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రశాంత్**

కొత్తకోట, సెప్టెంబర్ 7 ( నమస్తే ఉదయం) ప్రమాదవశాత్తు మృతి చెందిన గొర్రెలను కాంగ్రెస్ పార్టీ నాయకులు పరిశీలించారు.కొత్తకోట గొల్ల చంద్రయ్యకు చెందిన సుమారు 20 గొర్రెలు ప్రమాద వసతు మృతి చెందిన విషయం తెలుసుకుని సంఘటన స్థలంలో గొర్రెలను పరిశీలించి ఈ సంఘటనను దేవరకద్ర ఎమ్మెల్యే , జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జిఎంఆర్ దృష్టికి తీసుకువెళ్లి, ప్రభుత్వపరంగా ఆదుకుంటామని చంద్రయ్యకు హామీ ఇచ్చారు. ఘటనను పరిశీలించిన వారిలో మదనాపూర్ మార్కెట్ చైర్మన్ పల్లెపాగ ప్రశాంత్ , జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పాపయ్య గారి కృష్ణారెడ్డి , చెర్లపల్లి మాజీ సర్పంచ్ సూది రెడ్డి శేఖర్ రెడ్డి , జిల్లా రైతు నాయకులు వేముల శ్రీనివాస్ రెడ్డి , మాజీ కో ఆప్షన్ సభ్యులు జె ఎం మిషేక్ , వెంకటేశ్వర్ రెడ్డి, వేముల హరీష్ రెడ్డి తదితరులు ఉన్నారు .

# పాగుంట పెత్తందారుల పై హత్యాయత్నం కేసు నమోదు చేయాలి



గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 7(నమస్తే ఉదయం) రజకులపై దాడి చేసి తీవ్రంగా గాయపరచిన కేటీ దొడ్డి మండలం పాగుంట గ్రామంలోని పెత్తందారులపై తక్షణమే హత్యాయత్నం కేసు నమోదు చేయాలని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పైళ్ల ఆశయ్య డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పెత్తందారుల చేతిలో గాయపడిన రజకులను పరామర్శించి గద్వాల డిఎస్పి కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల 31 న పాగుంట గ్రామానికి చెందిన రమేష్,నత్తి రంగన్న, వీరేష్,అనే పెత్తందారులు,అదే గ్రామానికి చెందిన చాకలి దేవేంద్రప్ప ఇంటి పైకి మద్యం తాగి, ఖాళీ మద్యం సీసాలు విసిరేసి గొడవకు దిగారాని, అయిన రజక దేవేంద్రప్ప ఎటువంటి వాగ్వివాదం చేయలేదన్నారు. రాత్రి జరిగిన గొడవ గురించి మరుసటి రోజు ఉదయం పంచాయతీలో మాట్లాడదామని చాకలి దేవేంద్ర అతని కుమారుడు ప్రవీణ్ ను పెత్తందారులే పిలిపించారని అన్నారు. పంచాయతీ పెద్దల దగ్గరకు వెళుతుంటే మార్గమధ్యలోనే రమేష్, వీరేష్, నత్తి రంగస్వామి, బొండం వీరేష్, చిన్న వీరేష్ పెత్తందారులతో పాటు, బోయలగూడెం గ్రామానికి చెందిన కొంతమంది పెత్తందారులను పిలిపించుకొని రాళ్లు కట్టెలతో మూకుమ్మడిగా దేవేంద్రప్ప అతని కుమారుడు ప్రవీణ్ కుమార్ పై, వారి కుటుంబ ఆడపడుచు లపై దాడి చేశారని తెలిపారు. అడ్డువచ్చిన రజక మహిళలపై కూడా అసభ్య పదజాలంతో దూషించి దాడి చేశారని అన్నారు. మా ఇంటి ముందు అడుక్కుతినే కుక్కలు మమ్మల్ని ప్రశ్నిస్తారా" అంటూ పురుషుల బీజాలపై దాడి చేసి, మహిళలను సైతం అసభ్య పదజాలంతో దూషిస్తూ తీవ్రంగా గాయపరిచారని అన్నారు. సంఘటన జరిగి వారం రోజులు గడుస్తున్న ఇప్పటివరకు పెత్తందారులపై హత్యాయత్నం కింద కేసు నమోదు చేసి,చట్టపరమైన చర్యలు తీసుకోవడంలో ఎందుకు ఆలస్యం చేస్తున్నారని ప్రశ్నించారు. రజకులపై దాడి చేసిన పెత్తందారులు దర్జాగా గ్రామంలో కాలర్ ఎగరేసుకొని తిరుగుతున్నారని, పోలీసు విభాగం శాఖపరమైన చర్యలు తీసుకోకపోతే ఇది తప్పుడు సంకేతానికి ఆనవాళ్లు అవుతుందని అన్నారు. పెత్తందారుల ఆగడాలకు అడ్డుకట్ట వేయ్యకపోతే భవిష్యత్తులో అణగారిన కులాలపై ఇటువంటి దాడులు మరింత పెరిగే అవకాశం ఉందని అన్నారు. గ్రామంలో పోలీస్ పీకేటింగ్ ఏర్పాటు చేసి రజకులలో మనోధైర్యాన్ని నింపాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో ఈ అంశాన్ని రాష్ట్ర వ్యాప్త ఉద్యమంగా మారుస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో వృత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ నరసింహ, రజక సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నపాటి నరసింహులు, పట్టణ అధ్యక్షులు నరసింహ, జిల్లా ఉపాధ్యక్షులు ఉప్పేర్ అంజి, వృత్తి దారుల సంఘం నాయకులు మద్దిలేటి, సీఐటీయు జిల్లా అధ్యక్షులు ఏ.వెంకటస్వామి, జిల్లా ఉపాధ్యక్షులు ఉప్పేర్ నరసింహ,రజకులు గుత్త నాగరాజు,వీరేష్,రాము,రాముడు తదితరులు పాల్గొన్నారు.

# టాటానగర్ ప్లాస్టిక్ గోదాములో అగ్ని ప్రమాదం



టాటా నగర్‌లో ప్లాస్టిక్ గోదాములో దట్టమైన పొగలతో మంటలు




మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

బుద్వేల్, సెప్టెంబరు 7(నమస్తే ఉదయం) : మైలార్ దేవుపల్లి టాటా నగర్ లో ప్లాస్టిక్ స్క్రాఫ్ గోదాములో ఆదివారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం సంబవించింది. ప్లాస్టిక్ వర్ధాలతో గ్రాన్యుల్స్ తయారు చేసే ఈ గోదాము మూసి ఉన్న సమయంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఎవరికి ఎలాంటి ప్రమాదం జరుగలేదు. దట్టమైన పొగలతో మంటలు ఎగిసి పడుతుండగా స్థానికులు ఫైర్ స్టేషన్ కు కాల్ చేసి సమాచారం ఇచ్చారు. రాజేంద్రనగర్, చాంద్రాయణగుట్ట ఫైర్ స్టేషన్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పివేశారు. ఎవరికి ఎలాంటి గాయాలు తగులలేదు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ ఫైర్ స్టేషన్ అఫీసర్ చంద్ర నాయక్ మాట్లాడుతూ, తమకు ఫోన్ ద్వారా వచ్చిన సమాచారం తో టాటా నగర్ కు చేరుకుని మంటలు ఆర్పివేయడం జరిగిందన్నారు. నష్టం ఎంత జరిగిందో తెలియరాలేదన్నారు. తమకు యమజాని నుంచి ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు.

# వీర తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు

బుద్వేల్, సెప్టెంబరు 7(నమస్తే ఉదయం): సీపీఎం రాజేంద్రనగర్ మండల కమిటీ అధ్వర్యంలో ఆదివారం బుద్వేల్ ఎక్స్ టెన్షన్ చౌరస్తాలో వీర తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొని అమరులైన దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ చిత్రపటాలకు నివాళు లర్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుంకర రామ్మోహన్ రావు, సీపీఎం రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యుడు జె.రుద్రకుమార్, బచ్చలకూర స్వామి లు మాట్లాడారు. నిజాం రాజరిక వ్యవస్థకు వ్యతిరేకంగా 1916 నుంచి 1951 వరకు ప్రజలు చేసిన పోరాటమే తెలంగాణ సాయుధ పోరాటం అని గుర్తు చేశారు. భూమి కోసం, భుక్తి కోసం సాగిన ఈ పోరాటంలో రెండు వేలకు పై చిలుకు గ్రామాలు విముక్తి అయ్యాయని గుర్తు చేశారు. ఈ పోరాటులో నాలుగు వేల మంది అమరులైనారన్నారు. 10లక్షల పేద ప్రజలకు పంచిని చరిత్ర ఎర్ర జండాది అన్నారు. ఆ చరిత్రను వక్రీకరిస్తు బీజేపీ హిందువులకు, ముస్లీంలకు జరిగిన చరిత్ర అంబు పక్కదారి పట్టిను న్నారన్నారు. సాయుధ పోరాటం గురించి మాట్లాడే హక్కు బీజేపీ కి లేదన్నారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను గ్రామ స్థాయి నుంచి డివిజన్ స్థాయి వరకు జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ నాయకులు శ్రీపాల్ రెడ్డి, యాదయ్య, నర్సిం గ్, రంగస్వామీ, ఎన్ పార్వతి, జుట్కూరు మన్యం, చంద్రశేఖర్, వెంకటేశ్ నాయక్, శ్రీను, తిరుపతయ్య, శివమ్మ, దేవీ, మీనా బాయి తదితరులు పాల్గొన్నారు.



దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ చిత్ర పటాలకు నివాళులు అర్పిస్తున్న సీపీఎం నాయకులు సుంకర రామ్మోహన్ రావు, జె రుద్ర కుమార్, బచ్చల కూర స్వామీ

# ఆరాంఘర్ రైల్వే బ్రిడ్జి క్రింద వర్షం పడినప్పుడు ట్రాఫిక్ ఇబ్బందులు లేనట్లే



ఆరాంఘర్ రైల్వే బ్రిడ్జి కింద వరద నీరు ఆగడానికి గల కారణాలను తెలుసుకుంటున్న హైడ్రా కమిషనర్ ఏ వీ రంగనాథ్



ఆరాంఘర్ రైల్వే బ్రిడ్జి వద్ద మట్టితో కూరుకుపోయిన నాల ను శుభ్రం చేస్తున్న సిబ్బంది



నాలాను పూర్తిగా శుభ్రం చేసిన హైడ్రా సిబ్బంది

బుద్వేల్, సెప్టెంబరు 7(నమస్తే ఉదయం) : వర్షం పడినప్పుడల్లా ఆరాంఘర్ రైల్వే బ్రిడ్జి క్రింద వరద నీరు చేరి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతుండగా, హైడ్రా కమిషనర్ ఏ.వి రంగనాథ్ ప్రత్యేక చొరవతో ఆ సమస్యను పరిష్కరించగలిగారు. ఆరాంఘర్ చౌరస్తా రైల్వే బ్రిడ్జి క్రింద మేజర్ వాటర్ గోయింగ్ పాయింట్ లో గత కొన్ని సంవత్సరాలుగా మట్టి పేరుకు పోవడం కారణంగా అండర్ పాస్ రైల్వే బ్రిడ్జి క్రింద చిన్నపాటి వర్షం పడినా కూడా వాహనదారులు ఇబ్బందులు పడే వారు. గత నెలలో హైడ్రా కమిషనర్ ఏ.వి రంగనాథ్, హైడ్రా అడిషనల్ డైరెక్టర్ పాపయ్య, ఎడిఎఫ్ఎ యజ్ఞ నారాయణ, ఎస్ఎఫ్ఎ చంద్రశేఖర్ రెడ్డి ఆరాంఘర్ బ్రిడ్జి క్రింద ప్రాంతాన్ని పరిశీలించి మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్ సభ్యుల సహకారంతో నాలాలో పేరుకుపోయిన మట్టిని పూర్తిగా తొలగించారు. గత నెలలో ఐదు సెంటీమీటర్ల వర్షం పడితేనే ట్రాఫిక్ జామ్ భారీగా ఏర్పడి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. వారం రోజుల క్రితం 10 సెంటీ మీటర్ల వర్షం పడినా, ఎటువంటి ఇబ్బంది కలుగకుండ మాన్సూన్ టీమ్ వాహనదారులను క్లియర్ చేశారు. ఈ పనులలో ఆదికారుల పర్యవేక్షణలో హైడ్రా మార్షల్ రాములు సిబ్బంది చురుకుగా పనిచేశారు. వర్షాల సమయంలో కూడా రాజేంద్రనగర్ సర్కిల్ లో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండ చూస్తామని హైడ్రా అధికారులు, సిబ్బంది అంటున్నారు.



## 1.70 లక్షలు హైదర్‌గూడ డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ అసోసియేషన్ లడ్డూ

### లడ్డూను దక్కించుకున్న చీరాల శ్యామ్ రేణుకలు

రాజేంద్రనగర్, సెప్టెంబర్ 7 (నమస్తే ఉదయం) అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడలోని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ యూత్ అసోసియేషన్ నెలకొల్పిన గణనాథుడి లడ్డూ వేలం పాటతో పాటు నిమర్జన ఊరేగింపు ఘనంగా కొనసాగింది. 11 రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజలు అందుకున్న గణనాథుడి లడ్డూను స్థానిక ప్రాంతానికి చెందిన చీరాల శ్యామ్, రేణుకలు రూ.1.70 లక్షలకు కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా యూత్ అసోసియేషన్ సభ్యులు వారిని ఘనంగా సన్మానించి లడ్డూను అందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.






గణేష్ లడ్డును శిరస్సుపై పెట్టుకున్న అనంతయ్య

## శివరాంపల్లి ఆర్ఎస్ఎస్ యువజన సంఘం ఆధ్వర్యంలో నెల కొల్పిన లడ్డు వేలం దక్కించుకున్న అనంతయ్య

రాజేంద్రనగర్, సెప్టెంబర్ 7(నమస్తే ఉదయం) రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని బుద్వేల్ రైల్వే స్టేషన్ కు చెందిన ఆర్టీసీ ఉద్యోగి అనంతయ్య శివరాంపల్లి ఆర్ఎస్ఎస్ యువజన సంఘం నిర్వహించిన లడ్డూ వేలంలో రూ.30 వేలకు వేలంలో దక్కించుకున్నారు.

## కృష్ణానదీలో గల్లంతైన బాలుడు

గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్7(నమస్తే ఉదయం) కృష్ణానదిలో చేపల వేటకు వెళ్లిన ఇద్దరు మైనర్ బాలురులు ప్రమాదవశాత్తు నదీ ప్రవాహానికి కొట్టుకపోగ ఒక్కరు ఒడ్డుకు చేరుకున్నారు. మరొక బాలుడు గల్లంతయ్యాడు. ఈ ఘటన గద్వాల మండలం రేకులపల్లి గ్రామ సమీపంలో గల కృష్ణానదీలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. గద్వాల రూరల్ పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం... రేకులపల్లి గ్రామానికి చెందిన 8వ తరగతి చదువుతున్న చంద్రశేఖర్ (13) అనే బాలుడు, మరో బాలుడు కృష్ణతో కలిసి చేపలు పట్టేందుకు దిగువ జూరాల జలవిద్యుత్ కేంద్రం వద్ద కృష్ణా నదిలోకి వెళ్లారు. శనివారం రాత్రి చేపల కోసం పుట్టిలో ఇద్దరూ కలిసి వెళ్లి నదిలో వల ఏర్పాటు చేసి, చివరికి నది ఒడ్డుకు చేరుకున్నారు. రాత్రి కావడంతో పుట్టిలోనే ఇద్దరూ దుప్పటి కప్పుకుని నిద్రించారు. ఈ క్రమంలో శనివారం రాత్రి కృష్ణా నదిలో వరద ప్రవాహం అనూహ్యంగా పెరగడంతో వరద ప్రవాహానికి పుట్టి నీటిలో కొట్టుకుపోయి, జలవిద్యుత్ కేంద్రం కట్ట పై నుంచి కింద పడిపోయింది. అయితే కృష్ణకు ఈత రావడంతో ఈదుకుంటూ ఒడ్డుకు చేరగలిగాడు. ఈత రాని చంద్రశేఖర్ మాత్రం పుట్టితో సహా నది ఉధృతిలో కొట్టుకుపోయాడు. బాలుడు చంద్రశేఖర్ ఆచూకీ కోసం గ్రామస్తులు, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు నదిలో గాలింపు చర్యలు చేపడుతున్నారు.

# రాజేంద్రనగర్ సర్కిల్ వినాయక నవరాత్రులు, నిమజ్జనోత్సవాలు ప్రశాంతంగా జరగడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు


ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్


డీసీపీ చింతమనేని శ్రీనివాస్


జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి


డిప్యూటీ కమిషనర్ బి సురేందర్ రెడ్డి


వై శ్రీధర్, గణేశ్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి


ఎన్ మల్లారెడ్డి, గణేష్ ఉత్సవ సమితి ఉపాధ్యకులు

బుద్వేల్ సెప్టెంబరు 7(నమస్తే ఉదయం) : రాజేంద్రనగర్ సర్కిల్ లో వినాయక నిమజ్జనోత్సవాలు ప్రశాంతంగా జరిగాయి. అందుకు సహకరించిన వివిధ శాఖల అధికారులకు, మండపాల నిర్వాహకులకు, గణేశ్ ఉత్సవ సమితి ప్రతినిధులకు రాజేంద్రనగర్ సర్కిల్ గణేశ్ ఉత్సవ సమితి చైర్మన్, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టీప్రకాశ్ గౌడ్, రాజేంద్రనగర్ డీసీపీ చిం తమనేని శ్రీనివాస్, గ్రేటర్ దక్షిణ మండలం జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి, రాజేం ద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ బి.సురేందర్ రెడ్డి. గణేశ్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, ఉపాధ్యక్షులు ఎన్ మల్లారెడ్డి లు వేర్వేరు ప్రకటనల్లో ధన్యవాదాలు తెలియజేశారు. రాజేంద్రనగర్ పత్తికుంట లో చిన్నవి. పెద్దవి కలిపి 8వేల వినాయకుల వరకు నిమజ్జనం చేశారని రాజేంద్రనగర్ ఇన్స్పెక్టర్ క్యాస్ట్రో తెలిపారు. మైలారేవుపల్లి పల్లెచెరువు లో చిన్నవి పెద్దవి కలసి 900ల వినాయకులను నిమజ్జనం చేశారని ఇన్స్పెక్టర్ నరేందర్ వెల్లడిం చారు. 11 రోజుల పాటు వినాయక నవరాత్రులు. నిమజ్జనోత్సవాలు ఎంతో ఘనంగా ప్రశాంతంగా ప్రశాంతంగా జరిగాయన్నారు.

**అధికారులు బాగా కష్టపడ్డారు : ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ :**

రాజేంద్రనగర్ సర్కిల్ లో వినాయక నవరాత్రులు, నిమజ్జనోత్సవాలు ఘనంగా, ప్రశాంతంగా జరుగడానికి పోలీసు అధికారులతో పాటు జీహెచ్ఎంసీ, విద్యుత్, ఇంజనీరింగ్, పారిశుధ్య, జలమ ండలి అధికారులు ఎంతో కష్టపడి పనిచేశారు. వారందరికి పేరు పేరున ధన్యవాదాలు

**సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు : చింతమనేని శ్రీనివాస్, డీసీపీ, రాజేంద్రనగర్ :**

రాజేంద్రనగర్ సర్కిల్ లో దేశంలోని అన్ని ప్రాంతాలకు చెందిన ప్రజలు నివసిస్తారు. వారందరు కలసి వినాయక నవరాత్రులు పెద్ద ఎత్తున చేసుకుంటారు. అదే సమయంలో రాజేంద్రనగర్ సర్కిల్ లో ముస్లిం ల జనాభా కూడా ఎక్కువే. వారు కూడా వినాయక నవరాత్రులు, నిమజ్జనోత్సవాలకు బాగా సహకరించారు. వారందరికీ ధన్యవాదాలు. ఏ పండుగ వచ్చిన అన్ని మతాల వారు కలసి మెలసి నిర్వహించుకోవాలి.

**అధికారులకు ధన్యవాదాలు : వై శ్రీధర్, రాజేంద్రనగర్ సర్కిల్ గణేష్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి :**

రాజేంద్రనగర్ పత్తి కుంట వద్ద, పల్లె చెరువు వద్ద వినాయక నిమజ్జనాలకు చక్కగా ఏర్పాట్లు చేసిన గ్రేటర్ దక్షిణ మండలం జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి, రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ బి సురేందర్ రెడ్డి లకు ప్రత్యేక మైన ధన్యవాదాలు. గట్టి బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీస్ అధికారులందరికీ కృతజ్ఞతలు

# రాష్ట్రపతికి ప్రధాని బ్రీఫింగ్

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 7 (నమస్తే ఉదయం)**

దేశ ప్రధాని ఒక ముఖ్యమైన విదేశీ పర్యటన ముగించుకుని వచ్చిన తర్వాత, ఆ వివరాలను రాష్ట్రపతికి తెలియజేయడం అనేది ఒక గౌరవప్రదమైన సంప్రదాయం. అయితే, ఈ చిన్న ప్రోటోకాల్‌ను పాటించడం, విస్మరించడం మధ్య దేశ రాజకీయాలపై ఎంతటి ప్రభావం ఉంటుందో చరిత్ర స్పష్టంగా చూపిస్తోంది. ప్రస్తుతం ప్రధాని నరేంద్ర మోదీ ఈ సంప్రదాయాన్ని నిబద్ధతతో పాటిస్తుండగా, ఇదే విషయాన్ని విస్మరించి నాటి ప్రధాని రాజీవ్ గాంధీ తీవ్ర రాజకీయ సంక్షోభాన్ని ఎదుర్కొన్నారని ఆర్ఎస్ఎస్ సిద్ధాంతకర్త, తుగ్లక్ పత్రిక సంపాదకులు ఎస్. గురుమూర్తి గుర్తుచేశారు. శనివారం చైనా, జపాన్ పర్యటనల నుంచి తిరిగి వచ్చిన వెంటనే ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్రపతి భవన్‌కు వెళ్లి ద్రౌపదీ ముర్ముతో సమావేశమయ్యారు. చైనాలోని టియాంజిన్‌లో జరిగిన షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సదస్సు వివరాలను,



చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌లతో జరిపిన ద్వైపాక్షిక చర్చల సారాంశాన్ని ఆయన రాష్ట్రపతికి వివరించారు. ప్రధానిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ప్రతి విదేశీ పర్యటన అనంతరం రాష్ట్రపతికి ఇలా బ్రీఫింగ్ ఇవ్వడాన్ని మోదీ ఒక నియమంగా పాటిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎస్. గురుమూర్తి 'ఎక్స్' వేదికగా చేసిన ఒక పోస్ట్ తీవ్ర చర్చనీయాంశమైంది. "ప్రధాని మోదీ విదేశీ పర్యటనల తర్వాత రాష్ట్రపతికి బ్రీఫింగ్ ఇచ్చే ఈ ప్రోటోకాల్‌ను చూసినప్పుడల్లా, నాటి ప్రధాని రాజీవ్ గాంధీ తనను ఎలా అవమానించారో అప్పటి రాష్ట్రపతి జైల్ సింగ్ నా వద్ద కన్నీళ్లు పెట్టుకున్న రోజులు గుర్తొస్తాయి. అహంకారంతో వ్యవహరించిన రాజీవ్ తన పతనాన్ని తానే కొనితెచ్చుకున్నారు" అని గురుమూర్తి పేర్కొన్నారు. రాజీవ్ గాంధీ తీరుతో తీవ్రంగా నొచ్చుకున్న జైల్ సింగ్, ప్రధానికి తన ఆవేదనను తెలియజేస్తూ ఒక లేఖ రాయడానికి తన సహాయం కోరారని గురుమూర్తి గుర్తుచేసుకున్నారు. తాను రాసిన ఆ లేఖను 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' సంపాదకీయ సలహాదారు ముల్గావ్‌కర్ మెరుగుపరిచారని, అది 1987 మార్చి 31న ప్రచురితమైందని తెలిపారు. "ఆ లేఖ రాజీవ్ ప్రభుత్వంపై పేలిన మొదటి బాంబు. ఆ తర్వాత వారం రోజులకే ఫెయిర్‌ఫ్యాక్స్, ఆ వెంటనే హెచ్‌డీడబ్ల్యూ లంచాల కుంభకోణం, ఆపై వీపీ సింగ్ రాజీనామా, కొద్ది రోజులకే బోఫోర్స్ బాగోతం బయటపడ్డాయి. కేవలం 40 రోజుల్లో జరిగిన ఈ పరిణామాల నుంచి రాజీవ్ గాంధీ మళ్లీ కోలుకోలేకపోయారు" అని గురుమూర్తి వివరించారు.

# విశాఖలో ఈస్ట్ ఇండియా పెట్రోల్ కంపెనీపై పిడుగు


**పెట్రోల్ ఫిల్టర్ ట్యాంక్‌పై పిడుగు పడటంతో చెలరేగిన మంటలు**

**హుటాహుటిన రంగంలోకి దిగి మంటలను ఆర్పివేసిన ఫైర్ సిబ్బంది**

**పరిస్థితిపై స్పందించిన హెూం మంత్రి అనిత**

**పూర్తిగా అదుపులోకి వచ్చిన మంటలు, ప్రజలు భయపడొద్దని సూచన**

**ప్రమాద స్థలంలో కొనసాగుతున్న ఉన్నతాధికారుల పర్యవేక్షణ**



విశాఖపట్నం నగరంలో శనివారం భారీ వర్షాల నడుమ ఓ పెట్రోలియం కంపెనీలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుని కలకలం సృష్టించింది. ఈస్ట్ ఇండియా పెట్రోలియం కంపెనీ ప్రాంగణంలోని పెట్రోల్ ఫిల్టర్ ట్యాంక్‌పై పిడుగు నేరుగా పడటంతో ఒక్కసారిగా పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. దీంతో సమీప ప్రాంతాల్లో కాసేపు ఆందోళనకర వాతావరణం నెలకొంది. ప్రమాద సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన పలు ఫైరింజన్లతో ఘటనా స్థలానికి చేరుకున్నారు. వెంటనే మంటలను అదుపులోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టారు. కొద్దిసేపటికే మంటలను పూర్తిగా నియంత్రించడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనపై రాష్ట్ర హెూం శాఖ మంత్రి అనిత స్పందించారు. అగ్నిమాపక శాఖ ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది సకాలంలో స్పందించి మంటలను పూర్తిగా అదుపులోకి తెచ్చారని ఆమె తెలిపారు. ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా నియంత్రణలో ఉందని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని హెూం మంత్రి భరోసా ఇచ్చారు.

# సిపిఎం సీనియర్ నాయకులు ఎండి దస్తగిరి కుటుంబ సభ్యులను ఓదార్చిన సిపిఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి

జనగామ, సెప్టెంబర్ 07 (నమస్తే ఉదయం): జనగామ పట్టణ కేంద్రానికి చెందిన సిపిఎం సీనియర్ నాయకులు మాజీ కౌన్సిలర్ ఎండి దస్తగీర్ చెల్లె ఎండి షమీం సుల్తానా 65 సంవత్సరాలు అనారోగ్యంతో హనుమకొండలోని ఓ ప్రైవేటు హాస్పిటల్ లో చికిత్స పొందుతూ నిన్న రాత్రి మరణించింది.అంబేద్కర్ నగర్ లోని ఆర్డీఓ ఆఫీసు వద్ద గల వారి ఇంట్లో షమీం సుల్తానా పార్థివ దేహాన్ని సిపిఎం జిల్లా కమిటీ కార్యదర్శి మోకు కనుకరెడ్డి సందర్శించి ఎండి దస్తగిర్ వారి మేన అల్లుళ్ళు అన్నదమ్ములను అక్కచెల్లెళ్లను పరామర్శించి ఓదార్చారు. ఈసందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి మాట్లాడుతూ ఎండి దస్తగిరి సిపిఎం ఉద్యమాలకు చిన్నతనంలో ఆకర్షితుడై నాటి నుండి వారి కుటుంబ సభ్యులందరూ అన్నదమ్ములు అక్క చెల్లెలు సిపిఎం పార్టీకి వెన్నుదన్నుగా ఉన్నారని, అలాగే వారి పెద్ద అన్న ఎండి గౌస్ కాకతీయ రైలు ప్రమాదంలో ప్రయాణికులను కాపాడి తన ప్రాణ త్యాగం చేశాడని గుర్తు చేశారు. ఆయన కుమారుడు ఎండి అజారుద్దీన్ ఈరోజు సిపిఎం జిల్లా కమిటీ సభ్యునిగా కొనసాగుతున్నాడని తెలిపారు. షమీముకు ఈసందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ పక్షాన జోహార్లు అర్పిస్తున్నామని అన్నారు. ఈకార్యక్రమంలో సిపిఎం జిల్లా


సిపిఎం సీనియర్ నాయకుడు ఎం డి దస్తగిరి కుటుంబాన్ని పరామర్శించిన సిపిఎం పార్టీ నాయకులు

కార్యదర్శివర్గ సభ్యులు బొట్ల శేఖర్ కమిటీ సభ్యులు బూడిది గోపి పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ జిల్లా కమిటీ సభ్యులు విజేందర్ జనగామ పట్టణ దళిత సంఘం నాయకులు మల్లిగారి రాజు వారి కుటుంబ సభ్యులు ఎండి అబ్దుల్లా ఖదీర్ అన్వర్ రఫిక్ వారి కుమారులు ఎండి కమాల్ వసీం అక్బర్ తదితరులు పాల్గొన్నారు.



# అవసరమైతే ప్రభుత్వంపై పోరాడేందుకు సిద్ధం

**రాజ్‌గోపాల్‌రెడ్డి హాట్ కామెంట్స్**

హైదరాబాద్, సెప్టెంబర్ 7 (నమస్తే ఉదయం) తెలంగాణలో రాజకీయాలు హాట్‌హాట్‌గా ఉన్నాయి. సొంత పార్టీలోనే నిరసన గళం వినిపిస్తోంది. తమ పార్టీలోని సొంత నాయకులపైనే ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటున్న సందర్భాలు మరింత వివాదంగా మారుతున్నాయి. ఒకవైపు బీఆర్ఎస్‌లో కవిత చేసిన కామెంట్స్‌తో ఆ పార్టీకి చెందిన నేతలు తలలు పట్టుకునే పరిస్థితి ఏర్పడింది.

ఇక కాంగ్రెస్‌లో మునుగోడు ఎమ్మెలయే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఎపిసోడ్. పార్టీలో ఆందోళన కల్గిస్తోంది. తనకు మంత్రి పదవి ఇచ్చి పార్టీలో చేర్చుకున్నారని, ఇప్పటివరకూ తనకు మంత్రి పదవి ఇవ్వలేదనేది నిన్న మొన్నటి వరకూ రాజ్‌గోపాల్‌రెడ్డి నుంచి వచ్చిన మాట. ఇప్పుడు అదే రాజ్‌గోపాల్‌రెడ్డి పదవి కోసం ఎంత కాలమైనా ఎదురుచూస్తానంటున్నారు. కాకపోతే మునుగోడు ప్రజల కోసం ప్రభుత్వంపై పోరాటానికైనా సిద్ధమని వ్యాఖ్యానించారు.

యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల పాఠశాలలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. దీనిలో భాగంగా ఆయన హాట్ కామెంట్స్ చేశారు. ' మునుగోడు ప్రజలకు అన్యాయం జరిగితే ఊరుకోను. అవసరమైతే ప్రభుత్వంతో పోరాడేందుకు సిద్ధం. మునుగోడు కోసం ఎంత త్యాగమైనా చేస్తా. ట్రిపుల్ ఆర్ నిర్వాసితులకోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తా. పార్టీలో చేరినప్పుడు మంత్రి పదవి హామీ ఇచ్చారు. ఆలస్యమైనా ఫర్వాలేదు.. ఎదురుచూస్తా' అని పేర్కొన్నారు.

ఒకవైపు మునుగోడు ప్రజల కోసం ప్రభుత్వం పోరాటం చేస్తానని, అదే సమయంలో తన మంత్రి పదవి కోసం ఎదురుచూస్తానంటూ సంయమనంతో మాట్లాడిన మాటలు కాంగ్రెస్ పెద్దల్ని ఆలోచనలో పడేయడం ఖాయమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

మునుగోడు ప్రజల కోసం ఎంతటి త్యాగమైనా చేస్తానని, అవసరమై ప్రభుత్వంపై పోరాడటానికి సిద్ధమనే వ్యాఖ్యలు మరోసారి హీట్ పుట్టించేవిగా ఉన్నాయని, రాజ్‌గోపాల్‌రెడ్డి తన వ్యూహాన్ని మార్చుకున్నారనే దానికి ఈ వ్యాఖ్యలే నిదర్శమనేది రాజకీయ నిపుణుల అభిప్రాయం.



# ఏ క్షణంలో అయినా వెనుజులాపై అమెరికా దాడి!

**కరేబియన్ సముద్రంలో అమెరికా భారీ సైనిక మోహరింపు**

**వెనుజువెలా ఆక్రమణకు రంగం సిద్ధమంటూ ఆందోళనలు**

**మాదకద్రవ్యాల ముఠాలపై దాడులంటూ ట్రంప్ సర్కార్ ప్రకటన**

**అధ్యక్షుడు మదురోపై 50 మిలియన్ డాలర్ల భారీ రివార్డు**

**వెనుజువెలా చమురు నిల్వలపైనే అమెరికా కన్నని విశ్లేషకుల అభిప్రాయం**

**అమెరికా చర్యలపై ప్రపంచ దేశాల నుంచి తీవ్ర ఆందోళన**

కరేబియన్ సముద్రంలో ఒక్కసారిగా యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. ప్రపంచంలోనే అత్యధిక చమురు నిల్వలున్న వెనుజులాను లక్ష్యంగా చేసుకుని అమెరికా తన సైనిక బలగాలను భారీ ఎత్తున మోహరించింది. అత్యాధునిక యుద్ధ నౌకలు, జలాంతర్గాములు, ఫైటర్ జెట్‌లతో ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టడంతో ఏ క్షణంలోనైనా వెనుజువెలాపై దాడి జరగవచ్చనే ఆందోళనలు అంతర్జాతీయంగా వ్యక్తమవుతున్నాయి. తన హయాంలో ఏడు యుద్ధాలను ఆపానని గొప్పగా చెప్పుకునే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇప్పుడు మరో దేశంపైకి సైన్యాన్ని నడిపిస్తుండటం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

వెనుజువెలా నుంచి మాదకద్రవ్యాల ముఠాలు అమెరికాలోకి ప్రవేశిస్తున్నాయని, వాటిని అణిచివేసేందుకే ఈ సైనిక చర్య అని ట్రంప్ ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. ఈ డ్రగ్స్ మాఫియాతో వెనుజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోకు ప్రత్యక్ష సంబంధాలున్నాయని తీవ్ర ఆరోపణలు చేసింది. అంతటితో ఆగకుండా, మదురో ఆచూకీ తెలిపిన వారికి 50 మిలియన్ డాలర్ల (సుమారు రూ.430 కోట్లు) భారీ నజరానాను కూడా ప్రకటించింది. ఇటీవలే అధ్యక్షుడు ట్రంప్ సోషల్ మీడియా వేదికగా "మదురో ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయి" అని నేరుగా హెచ్చరించడం గమనార్హం. మదురో ఎన్నికను తాము గుర్తించడం లేదని వైట్ హౌస్ స్పష్టం చేయడంతో, అమెరికా చర్యల వెనుక అసలు ఉద్దేశం వేరే ఉందన్న అనుమానాలు బలపడుతున్నాయి.

అయితే, అమెరికా వాదనలను అంతర్జాతీయ విశ్లేషకులు కొట్టిపారేస్తున్నారు. ఇది కేవలం డ్రగ్స్ మాఫియాపై పోరాటం కాదని, వెనుజువెలాలో ఉన్న అపారమైన చమురు నిక్షేపాలపై ఆధిపత్యం కోసమే అమెరికా ఈ వ్యూహం పన్నిందని వారు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం వెనుజువెలా తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుని, రాజకీయంగా అస్థిరంగా ఉంది. ఇదే అదునుగా భావించి, ఆ దేశాన్ని ఆక్రమించుకునేందుకు అమెరికా ప్రయత్నిస్తోందని వారు ఆరోపిస్తున్నారు. సైనిక బలగాలను చూపించి బెదిరించే (గన్‌బోట్ డిప్లమసీ) ధోరణి ట్రంప్‌కు కొత్త కాకపోయినా, ఈసారి క్షేత్రస్థాయిలో సైన్యాన్ని మోహరించడం ఆందోళన కలిగిస్తోంది. ఈ పరిణామాలను నిశితంగా గమనిస్తున్న ప్రపంచ దేశాలు, సంయమనం పాటించాలని అమెరికాకు సూచిస్తున్నాయి. ఈ ఉద్రిక్తతలు ఇలాగే కొనసాగితే కరేబియన్ ప్రాంతంలో తీవ్ర పరిణామాలు తప్పవని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.DAMODHAR REDDY. "RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733